టపాసుల వ్యాపారులకు వర్షం దెబ్బ

కొనుగోళ్లకు రాని ప్రజలు • ఖాళీగా షాపులు




ఇల్లెందు: వర్షం కారణంగా ఖాళీగా ఉన్న షాపు, పాల్వంచ: బీసీఎం రోడ్డులో ఏర్పాటు చేసిన మతాబుల షాపులు

దీపావళి సందర్భంగా కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు వెలవెలబోయాయి. ఒక్కో దుకాణం అనుమతికి రూ.30 వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు చేసి వ్యాపారులు షాపులు ఏర్పాటు చేశారు. ఆదివారం వర్షం రావడంతో దుకాణాల మీద పట్టాలు కప్పి భద్రపరుచుకోవాల్సి వచ్చింది. ప్రజలు ఎవరూ బాణసంచా షాపుల వైపు రాలేదు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. – సాక్షి నెట్‌వర్క్

జాగ్రత్తలు పాటించండి..

జూలూరుపాడు: దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో అందరూ జాగ్రత్తలు పాటించాలని జూలూరుపాడు ఎస్‌ఐ బాదావత్ రవి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ బాణసంచా కాల్చేటప్పుడు ముందుగా బకెట్‌తో నీళ్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. టపాసులను పరిసరాలకు దూరంగా కాల్చాలని, పిల్లలను దూరంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. మతాబులు కాల్చేవారు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. కళ్లద్దాలు, కాళ్లకు పాదరక్షలు తప్పనిసరి అని చెప్పారు.

లంబాడీలను తొలగించే వరకూ పోరాటం

టేకులపల్లి: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకూ పోరాటం ఆపేది లేదని, ఆదివాసీలు చివరి వరకు పోరాటంలో ఐక్యంగా పాల్గొనాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు వాగబోయిన చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి ఈసాల రవి పిలుపునిచ్చారు. ఆదివారం బోడు గ్రామంలో జరిగిన ఏఎస్‌ఎస్‌పీ అత్యవసర సమావేశంలో వారు మాట్లాడారు. లంబాడీలకు ఎస్టీ హోదా రద్దు చేసే వరకు పాలకుల మీద పోరాటం కొనసాగించాలన్నారు. ఆర్టికల్ 342 ప్రకారం లంబాడీలకు భారతీయ రాజ్యాంగంలో ఎస్టీ గుర్తింపు లేదని, వారిని అక్రమంగా పాలకులు ఎస్టీ హోదా కల్పిస్తూ ఆదివాసీలకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. ఆదివాసీలు పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల్లో ఉన్న నాయకులు అందరూ చైతన్యం పెంపొందించుకుని ఉద్యమించాలని కోరారు. లంబాడీలకు ఎస్టీ కుల, రెసిడెన్సి, ఏజెన్సీ, భూమి నివాసం మీద పూర్తి హోదా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏకల్ అభియాన్ ఉపాధ్యక్షుడిగా పూన్యా

ఇల్లెందు: ఏకల్ అభియాన్ ఉత్తర తెలంగాణ ఉపాధ్యక్షుడిగా టేకులపల్లికి చెందిన పూన్యా నాయక్ ఎన్నికయ్యారు. ఆయన ఎంపికతో ఏకల్ అభియాన్ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లడం సులభమవుతుందని పలువురు తెలిపారు. పూన్యానాయక్‌కు ఏకల్ ఉపాధ్యక్షుడు అప్పలరాజు, కార్యదర్శి వాసుదేవరావు, సతీష్ ఖండేల్‌వాల్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయంలో ఫొటో ఎగ్జిబిషన్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గతంలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల ఫొటోలు, పేపర్ కటింగ్‌లు, గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమాల ఫొటో ఎగ్జిబిషన్‌ను శనివారం ఏర్పాటు చేశారు. గ్రంథాలయ చైర్మన్ వీరబాబు మాట్లాడుతూ కార్యక్రమాలు సన్మానాలు చేయడం ఒక ఎత్తు అయితే వాటిని ఫొటోలు, పేపర్ కటింగ్ రూపంలో ప్రదర్శించడం గొప్ప ఆలోచన అని కొనియాడారు. గ్రంథ పాలకురాలిని అభినందించారు. ఇలా ఎన్నో కార్యక్రమాలను గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడతాయన్నారు.